నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్ల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కార్యక్రమానికి హాజరై విన్నవించాలని వెల్లడించారు.

ఆస్తిపన్ను రాయితీని వినియోగించుకోవాలి

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఐదు శాతం రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ సూచించారు. 2025–26వ సంవత్సరానికి గాను చెల్లించాల్సిన ఆస్తిపన్నుపై ప్రభుత్వం ఐదు శాతం రాయితీ అందిస్తుందన్నారు. ఈ రాయితీ ఈ నెల 30వ తేదీ వరకు ఉంటుందన్నారు. సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్లకు చెందిన ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తిపన్నును చెల్లించి రాయితీ పొందాలన్నారు. సర్కిల్ కార్యాలయంలో ఆస్తిపన్ను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే బిల్లు కలెక్టర్‌తో పాటు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ఆయా ప్రాంతాల్లో రోజూ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజేంద్రనగర్: కాలనీలు బస్తీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలని బుద్వేల్ మెథడిస్ట్ చర్చి పాస్టర్ అశోక్ కుమార్ అన్నారు. చర్చి ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 250 మంది వైద్య సేవలను పొందారు. శిబిరాన్ని ప్రారంభించిన పాస్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలలో నిపుణులైన డాక్టర్ల బృందం వైద్య సేవలు అందిస్తారని.. ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ పైడినాయుడు సమాచారం మేరకు... ఈ నెల 4వ తేదీన ఉందాసాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా 30–35 సంవత్సరాల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. శరీరం గుర్తు పట్టడానికి వీలు లేకుండా కుళ్లిపోయి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



మణికొండ శివాలయంలో వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆర్యవైశ్యులు



ఖానాపూర్‌లో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్



గండిపేట అభయ హనుమాన్ ఆలయంలో...

కల్యాణం.. వైభోగం



హైదర్షాకోట్‌లో...

శ్రీరామ నవమి పర్వదినాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాలు.. ప్రధాన కూడళ్లలో సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాడవాడలా చలువ పందిళ్లు వేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఇతర ప్రముఖులు పలు ప్రాంతాల్లో నిర్వహించిన కల్యాణోత్సవ సంబురాల్లో పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు ఉత్సవాలకు హాజరై సీతారాముల వారిని దర్శించుకున్నారు.
– మైలార్‌దేవ్‌పల్లి, బండ్లగూడ, మణికొండ, అత్తాపూర్, రాజేంద్రనగర్





నర్ఖూడ శివారులోని అమ్మపల్లి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మణికొండ క్వార్టర్స్‌లో మాజీ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



నార్సింగిలో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



కాళీకానగర్‌లోని హనుమాన్ ఆలయంలో...



మల్కారంలో...



రాంబాగ్‌లో బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి తదితరులు



మధుబన్ కాలనీ వీరాంజనేయ స్వామి ఆలయంలో...



బుద్వేల్ వీరాంజనేయ స్వామి ఆలయంలో...



హైదర్‌గూడలో...

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు అవసరం



ఎన్ఎంగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌గౌడ్

అత్తాపూర్: వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లోని ఎన్ఎంగూడ చౌరస్తాలో బోయ రమేష్, టి.గురుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ... మండుతున్న ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక నేతలు సర్దార్ హర్మిందర్‌సింగ్, నాగరాజు, రవీందర్‌గౌడ్, రమాదేవి, యాదయ్య, ఫరూఖ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మణికొండ: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని విరివిగా ఏర్పాటు చేయాలని భారత్ వికాస్ పరిషత్ మణికొండ శాఖ అధ్యక్షుడు, ఎంప్లాయిస్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.పెంటారెడ్డి అన్నారు. నవ సేవా సంకల్ప ట్రస్ట్ వారు భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటి దానంతో ఎంతో పుణ్యం వస్తుందన్నారు. మానవసేవే మాధవ సేవగా గుర్తించి తమకు తోచిన విధంగా సహాయ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ట్రస్ట్ సభ్యులు మణి, భాస్కర్, మహేష్‌కుమార్, విష్ణు, నర్సింగ్‌రావు, రాజేంద్రకుమార్, సుధ, రామకృష్ణ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



అబ్దుల్ వాహిద్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శాస్త్రీపురం కింగ్స్ కాలనీకి చెందిన అబ్దుల్ వహీద్(40) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసై కుటుంబాన్ని సరిగా చూసుకోవడం లేదు. ఈ విషయమై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 2వ తేదీన సైతం గొడవ జరగడంతో భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అబ్దుల్ వాహిద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మా కాలనీల్లో సమస్యలు లేవు'

మణికొండ: 'మా కాలనీల్లో ఎలాంటి సమస్యలు లేవని, అయినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు మా కాలనీల్లో అనేక సమస్యలు ఉన్నాయి' అని పత్రికలకు ఎక్కడం శోచనీయమని మణికొండ మున్సిపాలిటీ, 5వ వార్డు పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీ, లాలమ్మ గార్డెన్ కాలనీల ప్రజలు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... తమ కాలనీల్లో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు సవ్యంగా ఉన్నాయన్నారు. గత మున్సిపాలిటీ పాలకవర్గంలో తమ కాలనీలకు రూ.కోట్ల నిధులతో సమస్యలను పరిష్కరించారన్నారు. అలాంటి కాలనీల్లో లేని సమస్యలను ఉన్నట్టుగా ప్రచారం చేసుకుని తమ కాలనీలకు చెడ్డ పేరు తేవటం మానుకోవాలన్నారు. అలాంటి పార్టీ వారి మాటలను ప్రజలు నమ్మవద్దని వారు కోరారు. ఫ్రెండ్స్ కాలనీలో కొన్ని చోట్ల యువకులు గంజాయి సేవిస్తున్నారని, వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్రెండ్ కాలనీ సంక్షేమ సంఘం నేతలు మహ్మద్ అబీద్ హుస్సేన్, హజీమ్, ఆలం, ఇసాక్ అహ్మద్, అబ్దుల్ బాసిత్, లాలమ్మ గార్డెన్ సంక్షేమ సంఘం నాయకులు సాయికుమార్, వేణుగోపాల్, అంజత్ హుస్సేన్, లోకనాథ్ పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

రాజేంద్రనగర్: బెల్టు షాపుపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి మద్యంతో పాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... బండ్లగూడ మల్లికార్జున్‌నగర్ ప్రాంతానికి చెందిన కె.వెంకటేశ్ కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా షాపులోనే మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. ఆదివారం డ్రైడే కావడంతో మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దుకాణంపై దాడి చేసి వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీతోనే దేశం సుభిక్షం



మణికొండలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్

మణికొండ: పట్టాలు తప్పిన దేశ పరిస్థితిని చక్కదిద్ది ప్రపంచానికే విశ్వగురువుగా చేయాలనే సంకల్పంతో ఏర్పడిన భారతీయ జనతా పార్టీ పాలనతో సుభిక్షంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల అధ్యక్షులు బి.రవికాంత్‌రెడ్డి, ఎం.నగేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కేంద్రాలలో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

బలమైన శక్తిగా బీజేపీ...

అత్తాపూర్: భారతీయ జనతా పార్టీ రోజురోజుకూ బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు సులిగె వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్, మల్లారెడ్డి హాజరయ్యారు. పార్టీ జెండాను ఎగురవేసి కార్యకర్తలు, ప్రజలకు మిఠాయిలను పంపిణీ చేశారు. స్థానిక నేతలు కొమురయ్య, సుధాకర్, విజయ్‌కుమార్, నల్లింగ్ రమేష్, జయానంద్‌రెడ్డి, రావుల జగన్, సిద్ధేశ్వర్, పొట్ట హరినాథ్, పి.వెంకట్‌రెడ్డి, కిట్టు, రాజు, శ్రీకాంత్, భరత్, విజయ్, స్వామి, సాయియాదవ్, అరుణ్, శివ, శేఖర్, అనిల్, సరిత, స్టార్ చిన్న, బాలకృష్ణ, అనురాధ, భరత్, అఖిల్, విజయారెడ్డి, కృష్ణవేణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. టీఎన్‌జీవోస్ కాలనీ, కాటేదాన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ జెండాను ఎగురవేశారు.



నార్సింగిలో బీజేపీ నాయకులు



హైదర్‌గూడలో కార్పొరేటర్ సంగీత, మల్లారెడ్డి



టీఎన్‌జీవోస్ కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి